



నేతి శివరామశర్మ

పొరబాటున దేవలోకం నుంచి గుమాస్తాల వంశంలోకి జారిపడిందా అన్నట్టుంది ఆమె. ఆమెది అందమైన శరీరం, ఎదుటివాడ్ని ఆకర్షించగలిగే రూపం. కట్నం ఇచ్చి పెళ్ళి చేయగలిగే స్తోమతగానీ, ఆమెది పదిమందికి బాగా తెలిసిన కుటుంబంగానీ కాదు. అందుకని గంతకు తగ్గ బొంత అన్నట్టు ఆమెను ఒక చిన్న గవర్నమెంటు ఆఫీసులో పనిచేసే ఒక గుమాస్తాకిచ్చి పెళ్ళి చేశారు.

ఆమె సాధారణ నేత చీర కట్టుకునేది. డబ్బు పెట్టి చాలా ఖరీదైన చీరలు కొనే స్తోమత లేదు గనక ఒక్కొక్కసారి ఆమె బాధపడేది తన దారిద్ర్యానికి. కానీ, తన అందం, ఆకర్షణను చూసుకుని సంతోషపడేది. ఉండే ఇల్లు కూడా చాలా పాతది. ఉప్పు ఉరిసిపోయి, ఎండి ఎముకలు కనిపిస్తున్న మనిషిలా వెక్కిరిస్తున్న గోడ ఇటుకలు, కాలు విరిగిన కుర్చీలు, బాగా మాసిపోయి చిరిగిపోయిన కర్టన్లు ఆమెకు కోపం, విసుగు, విరక్తి కలిగించినా ఓపిగ్గా భరిస్తోంది.

డైనింగ్ టేబిల్ ముందు భోజనానికి కూర్చుంది భర్తతో కూడా. ఆయన ఒక గిన్నె మూత తీశాడు. పెద్దగా, ఆనందంగా అరిచాడు వాసన ఘుమాళిస్తోందని, ఆ వాసనకు ముక్కు పుటాలు పగిలిపోతున్నాయని. ఇలాంటి మంచి వాసనింతకు ముందెప్పుడూ రాలేదని పొగిడాడు భార్యను. మా రాజుల ఇళ్ళల్లో భోజనాలు ఎలా వుంటాయో ఆమె ఊహలోకి వచ్చింది. వాళ్ళ బంగారు పళ్ళాలు, అందులో వడ్డించిన పిట్టల మాంసం, వాళ్ళ సంతోషాలు.

ఆమెకు నైటీలు లేవు, పెట్టుకోడానికి ఏడు వారాల నగలు లేవు. కనీసం మంచిది అని చెప్పుకోగలిగే ఒక మంచి వస్తువు కూడా లేదు ఇంట్లో.

ఆమెకు చిన్నప్పటి స్నేహితురాలొకటుంది. ఇద్దరూ కలిసి వీధి బడిలో చదువుకున్నారు. ఆ అమ్మాయి బాగా ఉన్న ఇంటి పిల్ల. ఆమె అంటే ఎందుకో అలర్జీ. ఒకసారి వాళ్ళ ఇంటికెళ్ళి వస్తే బాధపడే తనని ఓదారుస్తుందని తలచేది.

ఒకరోజు సాయంత్రం భర్త చేతిలో ఒక కవరు పట్టుకుని సంతోషంగా వచ్చాడు. "ఇదిగో ఇది నీకు" అన్నాడు కవరు చూపిస్తూ.

ఆమె కవరుచింపి చూసింది. అది తనని భర్తను గవర్నమెంటువాళ్ళు మీటింగ్‌కు రమ్మన్న ఆహ్వానం.

"అయితే నన్నేం చేయమంటావ్" అంది.

"అదేంటి నువ్వు ఎంతో సంతోషపడతావనుకున్నాను. నువ్వెప్పుడూ కూడా వెలుపలికి వెళ్ళవు గదా! ఈ సాకుతోనైనా వెళ్తావనుకున్నాను" అన్నాడు.

"అక్కడికెలా వెళ్ళేది. కట్టుకోడానికి కనీసం ఒక మంచి చీర కూడా లేదు" అంది ఏడుస్తూ కన్నీళ్ళు చెంపల నుండి కారి నోటిలోకి వచ్చాయి.

"అసలు విషయం ఏంటి చెప్పు అన్నాడు" భర్త.

## నక్షత్రాలు స్థిరంగా ఉన్నాయా?



ఈ మహా విశ్వంలో అనేక తారలున్నాయి. అవి విపరీతమైన వేగాలతో ఎక్కడికో ప్రయాణించి పోతున్నాయి. కాని విశేషం ఏమంటే అవి మాత్రం మనకి కదులుతున్నట్లు కనబడవు. ఇంకో విషయం రాత్రి పూట నక్షత్రాలు సమిష్టిగా ఆకాశంలో ప్రదక్షిణ చెయ్యడం వాటి గమనం కాదు. ఇది కేవలం భూమి ఆత్మభ్రమణం వల్ల అలా చుడుతున్నట్లు కనబడతాయి.

కాని నక్షత్రాలు వాస్తవానికి ఆకాశంలో సెకనుకు వేలాది కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి. కాని మనకి అలా కనబడడం లేదే? కదా. దీనికి కారణం ఏమిటి?

వాస్తవానికి వాటివేగం మన ఊహకే అందదు. ఈ "స్థిరతారలు" నిత్యం సెకనుకు కొన్ని వందలు మొదలు కొన్ని వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి. కాని మన దృష్టికి వాటి గమనం "వెంట్రుక వాసి" మాత్రమే.

ఈ మహా విశ్వంలోని నక్షత్రాల గమనం డిగ్రీలు, నిమిషాలు, సెకన్లతో కొలుస్తారు. విశ్వాన్ని గోళంగా 360 డిగ్రీలు ఉన్నట్లు భావిస్తారు. డిగ్రీని 60 నిమిషాలుగాను, నిమిషాన్ని 60 సెకన్లుగాను విభజిస్తారు. మొత్తం విశ్వం చుట్టి రావడానికి సుమారు 13 లక్షల సెకన్లు పడుతుంది. ఈ సెకనుకి, నిమిషానికి కాలంలోని సెకనుకి నిమిషానికి సంబంధం లేదు.

సిరియస్ (మృగవ్యాధుడు, శునకతార) అంతరిక్షంలో సంవత్సరానికి 1.3 సెకన్ల దూరం కదులుతుంది. 2000 సంవత్సరాల కాలంలో 1 1/2 చంద్ర వ్యాసాల దూరం కదులుతుంది. బర్నార్డ్ తార ఇంకా అధిక వేగాన్ని సూచిస్తుంది. 200 సంవత్సరాలకి ఒక చంద్ర వ్యాసాన్ని అధిగమిస్తుంది. అయితే ఈ సరికి మానవుల వంశంలో పది తరాలు గడిచిపోతాయి!

**- జమ్మి కోనేటిరావు**

"ఏముంది కట్టుకోడానికి సరైన చీర ఒకటి కూడా లేదు. కనుక పోవడం నాకిష్టం లేదు, ఇన్విటేషన్ మరెవరికైనా ఇవ్వండి పోతారు" అంది.

ఆ మాటకు భర్త నిర్ఘాంతపోయాడు. "అయితే పద డ్రెస్ కొందాం" అన్నాడు.

ఆమె ఆ మాట విని ఆశ్చర్యంతో కొన్ని క్షణాలు అలాగే వుండిపోయింది నిశ్చేష్టురాలై.

"రెండొందలివ్వండి చాలు. ఏదో ఒకటి కొనుక్కుంటాను మీకు బరువు లేకుండా" అంది.

"అలాగే కొను" అన్నాడు.

ఆ రోజు రానే వచ్చింది. ఆమెకు ఏదో ఆదుర్దా, భయం, బాధ అన్నీ కలిగాయి.

"నీ డ్రెస్ తయారైందని టైలర్ చెప్పాడు" అన్నాడు భర్త.

ఆమె ముఖంలో ఇంకా ఏదో కొరత కనబడింది. ఆ దిగులుకు కారణం అడిగాడు భర్త.

"ఏముంది ఒక చిన్నమెత్తు బంగారం కూడా లేదు వొంటిమీదకి, బోసిమెడతో నలుగురిలోకి ఎలా వెళ్ళేది. నా దారిద్ర్యం కొట్టొచ్చినట్టు కనబడదూ! దానికి బదులు పోకుండడమే మంచిది. మర్యాదైనా మిగులుతుంది" అంది.

"మీ స్నేహితురాలు కాంతం వుందిగా ఆమెనడిగి ఒక బంగారు గొలుసు అడిగి అరువు తెచ్చుకో" అన్నాడు.

"భలే ఆలోచన. అది నాకు రాలేదు" అంది.

మరుసటి రోజు ఆమె కాంతం ఇంటి కెళ్ళింది. ఆమె నగల పెట్టె తీసుకొచ్చి "ఇందులో నీ ఇష్టం వచ్చింది తీసుకో" అంటూ ఆమె ముందు పెట్టింది. రాళ్ళ నగలు, రాళ్ళు లేని నగలు బోల్డు వున్నాయి. అన్నిటినీ ఒక్కొక్కటి వేసుకొని అద్దంలో చూసుకుంది. దేన్నీ తీసేయడానికి లేకుండా నగలు అన్నీ బాగున్నాయని అనిపించింది. అందులోంచి డైమండ్ పొదిగిన ఒక నగ తీసుకుంది. మెడలో వేసుకుంది.అద్దంలో చూసుకొని మురిసిపోయింది.

"ఇది నాకిస్తావా? మళ్ళీ తెచ్చిస్తాను" అంది.

"తప్పకుండా తీసుకెళ్ళు" అంది కాంతం.

సంతోషంతో కాంతం మెడను కావలించుకొని చెంపమీద ముద్దుపెట్టింది. నగతో ఇంటికొచ్చింది.

ఆ రోజు రానే వచ్చింది. కొత్త చీర, స్నేహితురాలి దగ్గర అరువు తెచ్చుకున్న నగ వేసుకొంది. అవి వేసుకొని తన అందానికి తానే మురిసిపోయింది. ఫంక్షన్‌కెళ్ళింది. అందరూ ఆమె పేరు అడిగారు. "దీన్ని ఎక్కడ, ఎంతకు కొన్నావని" చాలామంది నగను పట్టి చూసి అడిగారు. చివరకు అఫీసరు కూడా అడిగాడు నగ సంగతి.

అందరితో ఆమె తాగింది. ఆనందంతో డాన్స్ చేసింది ఒళ్ళు మరచి.

తెల్లారి నాలుగు గంటలదాకా జరిగింది ఫంక్షన్. భర్త ఒక మూల పడుకుని నిద్ర పోయాడు.

చాలా చలిగా వుంది బైట. ఇంకా తానక్కడ వుంటే నలుగురిలో తన దరిద్రం బైట పడ్తుందేమోన్న భయం వేసి అక్కడి నుంచి త్వరగా ఇంటికి వెళ్ళాలనిపించింది.

ఇంటికెళ్ళి డ్రస్ విప్పింది. అద్దం ముందు నిల్చుంది. అద్దంలో తన అందం చూసుకుంది. మురిసిపోయింది. ఉన్నట్టుండి పెద్దగా అరిచింది. మెడలో వేసుకున్న నగ కనిపించలేదు.

ఆ అరుపు విని "ఏమైంది?" అన్నాడు భర్త.

"నగ నగ" పోయిందండీ!"

"ఎలా పోయింది? అలా జరగడానికి వీలు లేదు."

చీర మడతల్ని బాగా విదిలించి చూసింది. కానీ ఫలితం లేదు.

"ఫంక్షన్ అయిపోయింతర్వాత చూసుకున్నావా నగ వుందో లేదో అని"

"ఆ అప్పుడు వుందండీ"

"నగ రోడ్డులో పడి వుంటే శబ్దం వినిపించేదిగా లేక కారులో పడిందేమో!"

"బహుశా వుండొచ్చు."

"కారు నెంబరు గుర్తుందా?"

"లేదు మీకు గుర్తు లేదా?"

"లేదు"

ఒకరినొకరు చూసుకున్నారు.

"సరే నేనే వెళ్ళి దారంతా వెతికి వస్తాను" అని బైటికి వెళ్ళాడు భర్త. పడుకోడానికి కూడా ఓపిక లేక కుర్చీలో అలాగే కూర్చుండి పోయింది ఆమె.

"దొరకలేద"న్నాడు భర్త రోడ్డు మీద బాగా వెదికాక తిరిగి వచ్చి.

కార్ల కంపెనీలకంతా తిరిగాడు, కానీ ఫలితం లేకపోయింది.

"పోయి నీ స్నేహితురాలికి చెప్పు నగ పోయిందని!" అన్నాడు.

మరుసటిరోజు నగ పెట్టిన పెట్టెమీద వున్న అడ్రస్ ప్రకారం ఆ బంగారు అంగడికి పోయి అలాంటి నగ కోసం ప్రయత్నించారు. వాడు దాని ధర నలభై వేలు, మీకు కావాలంటే ముప్పై ఐదు వేలకిస్తా" నన్నాడు.

అప్పుచేసి, ఎలాగో ఓలాగు నగను కొని ఆమెకు తిరిగి ఇచ్చారు.

"దీనిని కొంచెం ముందుగా తిరిగి ఇచ్చి వుండాల్సింది నాకు అవసరం ఉండింది" అంది స్నేహితురాలు నగ పెట్టెను తీసుకుంటూ. కానీ ఆమె పెట్టెను తెరచి చూడలేదు. చూస్తే అది వేరే నగ అని గుర్తు పట్టి వుండేది అనుకుంది. తనని దొంగ అనుకునేదేమో అని అనిపించాక వొణికిపోయింది.

ఉన్న ఇల్లు ఖాళీ చేశారు. చిన్న ఇంటికి మారారు. పనిమనిషిని మాన్పించారు. అన్ని పనులనూ ఇప్పుడు తానే ఒంటరిగా చేసుకుంటోంది. సామాన్యుల కుటుంబం కన్నా ఇప్పుడు తక్కువగా బతకడం మొదలుపెట్టారు ఇద్దరూ.

ఆయన ఆఫీసులో ఓవర్ టైమ్ చేయడం మొదలుపెట్టాడు. ఆమె అక్కడక్కడా ఏవేవో పనులు చేయడం మొదలుపెట్టింది. ఇద్దరూ సంపాదిస్తున్నారు.

అలా పది సంవత్సరాలు గడిచాయి. వడ్డీతో సహా తీర్చేశారు చేసిన అప్పులన్నీ.

ఇద్దరూ బాగా ముసలివాళ్ళయ్యారు. తల వెంట్రుకలు నెరిసిపోయాయి. ముఖం నిండా ముడుతలొచ్చాయి. ఇంటి పనులు చేసుకోలేక పోతున్నారు. భర్త ఆఫీసుకు వెళ్ళాక ఆమె కిటికీ దగ్గర ఒంటరిగా కూర్చుని వుండేది.

నగ పోకుండా వుంటే ఎలా వుండేదో అనే ఆలోచన వచ్చింది. జీవితంలో ఒక చిన్న సంఘటన చాలు బాగుపడ్డానికో, చెడిపోవడానికో అనుకుంది.

ఒక రోజు సాయంత్రం తనకు నగ ఇచ్చిన స్నేహితురాలిని (కాంతం) చూసింది. ఆమె చేతిలో చిన్న కుర్రాడున్నాడు. ఆమె ఇంకా వయసులోనే వుంది. అందంగానే వుంది.

జరిగిందంతా ఆమెతో చెప్పాలనుకుంది.

దగ్గరగా వెళ్ళింది.ఆమెను పలకరించింది. ఏదో చెప్పబోయింది.

"మీరెవరో నాకు తెలియదు నేను మీరనుకున్నదాన్ని కాదు" అంది ఆమె.

"నీవు ఎంత మారిపోయావు?" అని అడిగింది ఆమెను.

"నాకు నీ రవ్వల నగ ఇచ్చావు జ్ఞాపకం వుందా?"

"అవును అది పోయింది"

"ఏమిటి నువ్వనేది మళ్ళీ తిరిగి ఇచ్చేశావుగా?"

అలాంటి నగనే కొని తీసుకొచ్చి ఇచ్చాను నీకు. అప్పుచేసి, ఆ అప్పు తీర్చడానికి 10 సంవత్సరాలు పట్టింది. నాలాంటి వాళ్ళకు అదెంత కష్టమో నీకు తెలుసు. అయినా అప్పు తీరిపోయింది కాబట్టి సంతోషంగా వుంది."

"అయితే ఆ నగ బదులు వేరే నగ కొని తెచ్చి యిచ్చావన్నమాట!"


"అవును నీవు గమనించలేదా? నీ నగలాగే వుంది గనక నీవు గమనించలేదేమో!"

ఆమె రెండు చేతులు పట్టుకుని "అయ్యో! అది బంగారు నగ కాదు. రోల్డ్ గోల్డ్. దాని ఖరీదంతా కలిసి రెండు వందలుంటే జాస్తి" అంది కాంతం.

ఇప్పుడు నిర్ఘాంతపోవడం ఆమె వంతైంది పాపం. ❋

(మపాసా "నెక్లెస్" కథ స్ఫూర్తితో)

## ఎందుకిలా?



అనుకోని అతిథిలా
పగబట్టిన భుజంగంలా
ఉవ్వెత్తున పైకి ఎగసి
అలల అలజడితో
లక్షలాది జన
జీవనాన్ని
సమాధి చేసింది
'సునామీ'
పాపం పెరిగిందనా!
మాయమాటల నాయకుల
ప్రభుత్వాలతో నీతి నిండుకుందనా!
దీవులకు దీవులే దిక్కులేని పక్షుల్లా
దీనంగా దిమ్మెరపోయాయి.
కానీ చివరకు జరిగిందేమిటి?
కూటికోసం చేపల వేట కోసం
నాటు పడవల పాటక జనం
నమ్ముకున్న కడలి-నట్టేట ముంచింది
భవంతులలో-భోగభాగ్యాలతో
చిద్విలాసంగా, చిందులేసే వారిని
ఏమీ చేయలేకపోయింది 'సునామీ'
ఏ ప్రళయం వచ్చినా- ఏం జరిగినా
బలి పశువులు- బడుగు జీవులేనా!
ఇదేనా దైవనీతి?!!

\- గాయత్రి